

# బొమ్మా-బొరుసా

చింతామణి సుబ్రహ్మణ్యం

ఎక్కడా జనసంచారం లేదు. కారు చీకటి నాలుగు మూలలా అలుముకొంది. ఈదరగాలి రఁయిమని వీస్తోంది. ఎక్కడ చూచినా కప్పలు బెకబెకమని అరుస్తున్నాయి. దానికితోడు కీచురాళ్ళ ధ్వనీ, మధ్యమధ్య కుక్క అరుపులూ భయంకొల్పుతూంది. ఆ అంధకారంలో ఎవరో ఒక వ్యక్తి శక్తి కొలదీ అడుగులు వేస్తూ నడుచుకెళ్ళిపోతున్నాడు.

అదొక గ్రామం— పేరు ఆర్యాపురం ఆ వూరిమధ్యన ఓ పెద్ద బంగళా — అది ఆ పూరులో శ్రీమంతుడైన రాజా రావుగారి యిల్లు ఓ వ్యక్తి సరాసరి ఆ బంగళా చేరేడు. తలుపులు దబాబ చరిచాడు

"ఎవరు వారు," లోపలినుండే అడగడం వినిపించింది

"తలుపు తియ్యండి బాబూ! త్వరగా తలుపు తియ్యండి," ఎంత గానో ఆతృత వ్యక్తమవుతూం దాతని కంఠంలో

తలుపు తెరిచా డొక వ్యక్తి. "ఎవరది? నువ్వా చంద్రన్నా? అయ్యగారూ, అమ్మగారూ ఏరి?" అని అడిగేలోగానే చంద్రన్న బావురుమని ఏడుస్తూ కూలబడిపోయాడు దానికి తోడు అతని భుజంమీద పదిలంగా గుడ్డలమధ్య చుట్టబడివున్న కుర్రాడు ఏడవడం ప్రారంభించాడు

ఈ హడావుడికి యింటిల్లిపాదీ లేచారు "ఏమైందిఎవరదిచంద్రన్నా! చినబాబా? ఏమయింది చంద్రన్నా? అక్కా, బావా ఏరి?" అంటూ ఒక 25 సంవత్సరాల యువకుడు ఆతురతగా అక్కడికొచ్చాడు అతనా జమీందారు రాజారావుగారి బావమరిది — పేరు శ్రీపతి

చంద్రన్న యీసారి దుఃఖాన్ని మరి ఆపుకోలేక రోదించడం మొదలెట్టాడు "ఏమయింది, చంద్రన్నా? అసలు విషయ మేమిటి? ఏమీ ప్రమాదం లేదుకదా," అడిగాడు శ్రీపతి

"ఇంకేముంది బాబయ్యా! అంతా ఘోరమైపోయింది అయ్యగార్నీ, అమ్మగార్నీ గోదావరి పొట్ట బెట్టుకుంది" ఇంటిల్లిపాదీ కుప్పలా కూలి పోయారు ఒక్కసారిగా రోదనలకు చుట్టుపక్కలవాళ్ళు లేచారు అర గంటలో యీ వార్త ఆ గ్రామం వాళ్ళందరకు తెలిసిపోయింది బాధ పడని వ్యక్తులు లేరు, చిన్నా పెద్దా రాజారావు మంచితనాన్నీ, దయా దాతృత్వాల్నీ జ్ఞప్తికి తెచ్చుకుంటూ చాలా బాధపడ్డారు తెల్లారేవరకూ జనం అక్కడే వున్నారు

చంద్రన్న రాజారావుగారి ఇంట్లో చాలా సంవత్సరాలుగా నమ్మకంగా సేవ చేస్తున్న నౌకరు. రాజారావు గార్కీ ఆయన భార్య కమలమ్మగార్కీ చంద్రన్నంటే ఎక్కడలేని అభిమానం చిన్నబాబు ఒక్క ఘడియకూడా చంద్రన్నను వదలి వుండలేడు పెద బాబు రఘు నాలుగేళ్ళవాడు అతను కూడా చంద్రన్న చేతిలో పెరిగిన వాడే అందుకనే రాజారావుగారు భద్రాచలం శ్రీరామనవమికి యాత్ర కెడుతూ చంద్రన్నను కూడా తీసు

కెళ్ళేరు. ఇప్పుడేకాదు, చంద్రన్న లేందే త నెక్కడికీ వెళ్ళడు

"అసలు ప్రమాదం ఎలా జరిగింది చంద్రన్నా?" శ్రీపతి అడిగాడు.

"ఏం చెప్పమంటారు బాబూ? పది పదేను పడవలనిండా జనం కిక్కిరిసున్నారు; పడవలోళ్ళు ఉషారుగా నడుపుతున్నారు జనం పాటలు పాడుకుంటూ భజనలు చేస్తూ సందడిగా వున్నారు ఎక్కడనుండి ముంచుకొచ్చిందో బాబూ సుడిగాలి – ఉరుములు, మెరుపులు, హోరుమని వాన! కన్నుమూసి తెరచేలోపుగా గోదావరి కల్లోలం అయిపోయింది ఎక్కడ చూసినా బోల్తాపడ్డ పడవలే, ఏవేపు చూసినాఅరుపులూ గిలగిలాకొట్టుకునే జనమే చినబాబు నా బుజంమీదే వున్నారు ఒక పెద్ద దూలం లాటిది దొరికింది ఈ బాబు ఓ మూల పడుపు, గాలికి ఎనక్కీ ముందుకీ వూగుతుంది దూలం ఓ పడవవాడు మమ్మళ్ళి నెమ్మదిగా గట్టుకు చేర్చేడు అయ్యగారూ, అమ్మగారూ పెదబాబుగారూ, ఎలాగేనా బైటపడ్తారేమో అని ఆ రాత్రీ, మర్నాడు సాయంత్రంవరకూ ఆ చల్లో ఓ చెట్టుకిందే వున్నాను ఇంకెక్కడ బాబుగారు! గోదావరికి బలై పోయారు" ఏడ్పు ఆపుకోలేక మళ్ళీ భోరున ఏడ్చాడు చంద్రన్న.

"ఏడవకు, చంద్రన్నా! ఏం చేస్తాం ఇంతకీ మన దురదృష్టం. పోనీలే, చిన్నబాబూ, నువ్వైనా బ్రతికివచ్చారు" అంటూ ఓదార్చాడు శ్రీపతి.

ఈ సంఘటన జరిగి 15 రోజులైంది రాజారావుగారు, కమలమ్మగారు వాళ్ళతోబాటు పెదబాబు రఘూ చని పోయినట్లు నిర్ధారణయింది. చంద్రన్న విచారంతో మంచం పట్టాడు.

రాత్రి సుమారు ఒంటిగంటవుతోంది. శ్రీపతి గొంతు – ఎవరి నుద్దేశించో, "యీ కాస్తపనీ చేశావంటే మన దారి కడ్డుండదు జాగ్రత్త! త్రినేత్రుడికి కూడా తెలియకూడదుసుమా. ఇది రేపు రాత్రిలోగా జరిగిపోవాలి." అని హెచ్చరించింది.

చంద్రన్న అంత నీరసంలోనూ త్రుళ్ళిపడి కెవ్వుమన్నాడు అతని గుండెల్లో రైళ్ళు పరుగెడ్తున్నాయి. మోసం, ఏదో కుట్ర జరుగుతూందని అతని అంతరాత్మ చెబుతోంది 'చిన బాబు అయ్యగారి వంశం చినబాబుతో అంతమైపోతుంది. అలా జరక్కూడదు. ఎన్నటికీ అలా జరగనియ్యను ' ఏవేవో ఆలోచనలు– చంద్రన్న బుర్ర తిరిగి పోయింది

అంతా నిశ్శబ్దంగావుంది బహుశా రాత్రి రెండు గంటలు దాటివుంటుంది! చంద్రన్న నెమ్మదిగా లేచాడు నీరసంతో తూలుతూ చినబాబున్న గదిలో కెళ్ళాడు బాబు నిద్రపోతున్నాడు.

అలికిడి చేయకుండా ఒక సంచీలో దొరికిన బట్టలూ, గోడనున్న అయ్య గారి ఫోటో పెట్టుకున్నాడు చిన్న బాబుని నెమ్మదిగా భుజంమీ దేసు కున్నాడు. ఎక్కడ లేనిశక్తి, ఆవేశం అతనిలో ప్రవేశించాయి పెరటి గుమ్మం తీసుకొని బయటపడ్డాడు ఎక్కడా జనసంచారం లేదు పొలాల్లో పడి అలాఅలా వూరు దాటిపోయాడు

తెల్లవారింది శ్రీపతి విసురుగా తిరుగుతూ అందరిమీదా మండిపడి పోతున్నాడు "ఏమయ్యాడు చిన బాబు? ఆ చంద్రన్నగాడే ఏదో అఘా యిత్యం చేసుంటాడు," అని పైక న్నాడు 'డామిట్,కథ అడ్డం తిరిగింది,' లోపలబాధతో వెర్రెత్తిపోతున్నాడు


"చంద్రన్న చినబాబును తీసుకొని ఎక్కడకో పోయాడు '' ఈ వార్త క్షణంలో ఊళ్లో ప్రాకిపోయింది అందరికీ ఆశ్చర్యం అదో వింతగా తలచారుజనమంతా కారణమేమిటో ఎవరూ వూహించలేకపోయారు

మసకచీకటి పడుతూంది ఎవరో ఒక వ్యక్తి పరుగుపరుగున శ్రీపతి దగ్గర కొచ్చాడు "అయ్యా, అయ్యా! కాలవవడ్డున శవం —రెండేళ్ళ పిల్లాడు— మన చినబాబు పోలికే మొహమంతా పోలిక తెలియకుండా దెబ్బలతో వుంది, అంటూ ఆతృతగా చెప్పాడు ఇది ఊరి వాళ్ళందరికీ మరీ భయాందోళనలను కల్గించింది

చంద్రన్న చినబాబుని చంపేసి నగలు తీసికొని పరారీఅయిపోయాడు. వార్త ఊరంతా ప్రాకింది ప్రతి నోటంటా "దుర్మార్గుడు ! నమ్మించి ఎంత ద్రోహానికి తలపడ్డాడు!" అంటూ విన్పించాయి శ్రీపతి యీ వార్త పోలీసుస్టేషనుకు తెలియపర్చాడు కేసు నమోదయింది చినబాబు చంప బడ్డాడు. చంద్రన్న చినబాబును హత్య చేసి చినబాబుమీద వున్న బంగారు నగలతో పరారీ అయ్యాడు, పేపర్లో వచ్చింది — చంద్రన్నను అప్పగించిన వారికి వెయ్యి రూపాయలు బహు మతి

అలా ఊరుదాటి ప్రక్కఊరు స్టేష నులో రైలు ఎక్కి చంద్రన్న సరాసరి పట్నం చేరుకున్నాడు పట్నంలో చంద్రన్న మేనల్లుడురామయ్య ఇంటికి చేరేడు రామయ్య చంద్రన్నను చూసి ఆశ్చర్యపోయాడు "ఏంటి మావా! నువ్వు చినబాబును చంపి నగలతో పరారీ అయినట్లు యియ్యాల పేప రులో చూసి గాబరా అయిపోయాను ఏంటిది, యీ బాబెవరు ?"

"అంతా చెప్తాను, ముందు లోప లకుపద చినబాబుగారిక్కనిద్రొస్తంది " లోపల కెళ్ళి చినబాబును ప్రక్కమీద




వండుకోబెట్టి కథంతా పూసగుచ్చినట్లు చెప్పాడు చంద్రన్న

రామన్న ఆశ్చర్యపోయాడు. అంతే మాఁవా! డబ్బు పాపిష్టిది. ఎలాటోడికైనా నీచపుబుద్ధి పుడతది అది సరే గాని, నువ్వుజాగ్రత్తగా వుండు. పగలు పైకి రామోక కాస్త బలం వొచ్చే దాకా యింటికాడే వుండు. ఆపైన రాత్రిళ్ళు నువ్వూ, పగలు నేనూ మన రిక్షాయే లాక్కుందాం. చినబాబుగార్ని మన లక్ష్మి చూసుకుంటుంది."

చంద్రన్నకు వెయ్యేనుగుల బలం ఒక్కసారిగా వచ్చింది.

చంద్రన్న నెమ్మదిగా స్వస్థ డయ్యాడు. చినబాబు హాయిగా ఆడు కుంటూ తిరుగుతున్నాడు. ఏడాది గడిచిపోయింది. పగలు రాఁవన్నా రాత్రి చంద్రన్నా రిక్షా లాగుకుంటు న్నారు

మొదటాట సినిమా వదిలారు. ఎక్కడచూచినా కలకలలాడుతోంది. జనం కోలాహాలం చేస్తూ నడుస్తు న్నారు రిక్షాబళ్ళ సందడి, కార్లు బఁయ్యిమని అరుచుకుంటూ బయలు దేరి దూసుకుపోతున్నాయి చంద్రన్న రిక్షాకే బేరం తగిలింది భార్యా భర్తా పిల్లవాడూ పిల్లవాడ్ని భుజంమీ దేసు కుందితల్లి. "శ్రీనగర్ వెళ్ళాలి,త్వరగా పోనియ్ బాబు," నిద్రపోతున్నాడు రిక్షా వెళ్తోంది "సరిగ్గా మన కథలాగేవుంది యీ సినీమా కథకూడా. అబ్బా! ఆవేళ విషయం తల్చుకుంటే నా కిప్పటికి

వళ్లు జలదరిస్తోంది. అయితే సినిమాలో విమానం కూలి చచ్చిపోయారు. అప్పుడు నావలు తిరగబడి చచ్చిపోయారు. సరిగ్గా యివాళకు ఎడాది.'' అంటూ ఏదో చెప్తోంది భర్తతో ఆ యిల్లాలు.

రిక్షా తొక్కుతూన్న చంద్రన్న ఒక్కసారిగా అదిరిపడ్డాడు. అయ్యగారూ, అమ్మగారూ, పెదబాబూకళ్ళ ముందు నిల్చున్నారు. "ఏం ప్రమాదం, తల్లీ, అంటూన్నారూ!'' అప్రయత్నంగా అడిగాడుచంద్రన్న. "ఇప్పటి మాట కాదోయ్. క్రిందటిసంవత్సరం భద్రాచలం వెళ్లాం- ఏం చెప్పమంటావ్? వున్నపాళంగా తుఫాన్ వచ్చి మేం వెళ్తూన్న నావలన్నీ బోల్తాపడ్డాయి. ఎంతమంది చచ్చిపోయారో చెప్పలేం. భగవంతుని ధర్మమా అని బ్రతికాం. ఈ బాబుని ఒక పల్లెవాడు ఒడ్డుకు చేర్చాడుపాపం తల్లీతండ్రీ గంగపాలై పోయేవుంటారు. అప్పటినుండీ మేమే పెంచుతున్నాం. మాకు పిల్లల్లేనందుకు భగవంతుడు మాకిచ్చిన వరప్రసాదం. ఈ వేళకు సరిగ్గా ఏడాదైంది - బాబు మా ఇంట్లో అడుగుపెట్టి," చంద్రన్న ఆత్రుత అధికమైంది.

'మా పెదబాబుగారేమో' "అలాగా, తల్లీ? ఎంత ఘోరమైందమ్మా!" అంటూనే వెనక్కి తిరిగి రిక్షాలో ఉన్న పిల్లాణ్ణి పరికించి చూచాడు. అదే ఆ కాలుమీద పెద్ద పుట్టుమచ్చ. చంద్రన్న నరనరాలా విద్యుచ్ఛక్తి ప్రసరించింది.మళ్ళీచూచాడు. అవును- పెదబాబు రఘు - ఆశ్చర్యం, బాధా, దుఃఖం, సంతోషం అన్నీ కట్టగట్టుకుని మీద పడ్డాయి. 'బ్రతికున్నారా పెదబాబూ! తల్లీదండ్రీలేని దిక్కుమాలిన పశువులై యిలా వున్నారా ఇంటికొకరై,' అని విలపించాడు. కాని పైకి చెప్పలేదు. అమ్మో! చెప్తే యింకేమేనావుందా- ఈనీడకూడా వుండదు. ఎక్కడో అక్కడ బ్రతికి బట్టకడితే అంతేచాలు "ఇదే, ఎడంప్రక్క కటకటాలింటిదగ్గరాపు!" అనేవరకు చంద్రన్నకు తెలివొచ్చింది. బాబు నిద్రపోతున్నాడు. చంద్రన్న దగ్గరగా వెళ్ళి బాబుమీద చెయ్యేసి, "అంతప్రమాదం నుండి తప్పుకుని మీ రింటి కొచ్చారంటే అంతా ఆ భగవంతుడి దయే తల్లీ," అంటూ ముఖం మరోసారి పరికించిచూచాడు. 'ఇంకానమ్మకం లేదా చంద్రన్నా!' నేనే పెదబాబుని' అని కొట్టొచ్చినట్లు అంతరాత్మలో అనిపించింది.

సరాసరి చంద్రన్న యింటిముఖం పట్టాడు. ఇంకేం బేరం కట్టాలని లేదు. 'పెదబాబు బ్రతికేవున్నాడు. రోజూ ఒకసారయినా బాబుని చూడాలి. పలకరిస్తే గుర్తుపడ్తాడు పెదబాబు వద్దు దూరంనుంచే చూస్తాను. ఇల్లు



చేరాడు. చినబాబు నిద్రపోతున్నాడు. చంద్రన్న నిద్రపోలేదు ఈ సంగతి తనకు తప్ప మరెవరికీ తెలియకూడదు.

రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ దొర్లిపోతున్నాయి. 20 సంవత్సరాలు కాలగర్భంలో కలసిపోయాయి.

చినబాబు బి. ఏ. చదువుతున్నాడు. పెదబాబు ప్లీడరై రెండు సంవత్సరాలయింది. ఓ మూల చినబాబును పెంచుకొస్తూ, పెదబాబుకి కీనీడై తిరుగుతున్నాడు చంద్రన్న. అయ్యగారూ అమ్మగారూ పోయిన బాధ ఓ మూల వేధిస్తూన్నా, అయ్యగారి వంశం నిలబడింది. అదే కావాలి. అందుకే తను జీవిస్తున్నాడుకూడా.

ఆ వేళ సాయంత్రం ౬ గంట అవుతూంది. పెదబాబుకోర్టునుండిచంద్రన్న రిక్షాలోనే వచ్చాడు. ఇంటిదగ్గర దిగి డబ్బులిచ్చి యింట్లో కెళ్తూంటే అతని

ని వే చూస్తూ నిలబడ్డాడు చంద్రన్న. ఇంతలో ఒక కారు దూసుకుంటూ వచ్చి చంద్రన్నరిక్షాను ఢీకొంది. అమాంతం చంద్రన్న తుళ్లి క్రింద పడ్డాడు. కారు సడన్ బ్రేక్‌లో ఆగింది. పెదబాబు వెనక్కి పరుగెత్తుకొచ్చేడు. చంద్రన్నను ఆదుకున్నాడు.

కార్లోంచి విసురుగా దిగాడు ఒక వ్యక్తి. రిక్షావాడిమీద మండిపోతూ మతిలేక తనూ లేవనెత్తడానికి దగ్గర కెళ్ళాడు అమాంతం అతని ముఖంలో ఆవేదనా, కాళ్ళుతడబడ్డాయి. చంద్రన్న పడి మోకాలుమీద మాత్రం బలంగా గాయం తగిలి రక్తం కారుతోంది. పెదబాబు ఇంట్లోకి పరుగెత్తాడు. "చంద్రన్న!" అప్రయత్నంగా గట్టిగా అరిచాడు కారులోంచి దిగిన వ్యక్తి.

చంద్రన్న నెమ్మదిగా కళ్లిప్పాడు. తేరిపార చూచాడు. "శ్రీపతీ! చిన బాబును చంపకు; నీకు పుణ్యం వుంటుంది. చంపకు," అని పిచ్చిగా అరిచి మూర్ఛపోయాడు. పెదబాబు గబగబావచ్చి కట్టుకట్టేడు. ఆ కార్లోనే చంద్రన్నను తీసుకొనివెళ్లి ఆస్పత్రిలో చేర్చారు.

స్పృహ వచ్చేసరికి పెదబాబు మాత్రం ప్రక్కనున్న కుర్చీలో ఉన్నాడు. చుట్టూ చూశాడుచంద్రన్న. ఇంకెవరూ కనబడలేదు.

"ఎలా వుంది, తాతా? గాభరా లేదు, తగ్గిపోతుంది. మరి నేను వెడతా; మీ వాళ్ళెవరికైనా కబురు చెయ్య మంటావా?"

"బాబూ! మా చినబాబుకి కబురు చెయ్యండి. చీకటి పడ్డాకరమ్మనండి." అడ్రసు రాసుకున్నాడు. పెదబాబు వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు సాయంత్రం చిన బాబు సరాసరి కాలేజీనుంచి ఆతుర తగావచ్చాడు. అతనితో పాటు 13 ఏళ్ళ వయస్సుగల అమ్మాయి కూడా వచ్చి ప్రక్కనే నిలబడింది. "ఎలా ఉంది తాతా! (చిన్నప్పటినుండీ తాత అనే అలవాటు) ఎక్కడ తగిలింది దెబ్బ?" మంచంమీద ప్రక్కనే కూర్చుని అడి గాడు చినబాబు. "కంగారు లేదు బాబూ! చిన్న దెబ్బే. సరేగాని బాబూ! నువ్వు యింటికెళ్ళి చదువుకో. వస్తే చీకటి పడ్డాక మాత్రం ఇక్కడకు రా బాబూ. త్వరగా వెళ్ళి చదువుకో." ఆతృతగా భయంగా చెప్పాడు చంద్రన్న.

"తాతా! యీ అమ్మాయి నాతో చదువుతోంది; పేరు రాధ. నేను గాభరాపడ్తుంటే నిన్ను చూడాలని నాతో కూడా వచ్చింది."

"అలాగా తల్లీ! మా చినబాబు ఒట్టి అమాయకుడు తల్లీ! కాస్త జాగ్రత్తగా చూడమ్మా! బాగా చదువుకోండి."

"తాతా, వీళ్ళ నాన్నగారు పెద్ద జమీందారు. శ్రీపతిగారని – ఇక్కడికి 60 మైళ్ళుంటుంది – ఆర్యాపురమని ఆ వూరు. చంద్రన్న ముఖం అమాంతం మారిపోయింది. జమీందారు శ్రీపతి, ఆర్యాపురం. "బాబూ! నువ్వు త్వరగా వెళ్ళిపో బాబూ ! అమ్మా! వెళ్ళండి." చినబాబూ, రాధా వెళ్ళేరు.

చంద్రన్న కంతా అయోమయంగా వుంది 'పరమాత్మా! ఏమిటి నీ లీల! ఇంతవరకూ నా శక్తికొలదీ చేశాను. ఇకమీద నీదే భారం' అంటూ వెయ్యి దేవుళ్ళకు మొక్కాడు.

పెదబాబు రోజూ ఏదో ఒక టైములో వచ్చి చూసివెళ్తున్నాడు. ఆ రోజు పెదబాబు వచ్చేసరికి శ్రీపతి కంఠం: "సరే, ఆలోచించి రేపీపాటికి చెప్పు," అంటూ పెదబాబును చూచి, లేని నవ్వు తెచ్చుకొని చరచరా వెళ్ళి పోయేడు. "ఏమిటి తాతా అంటు న్నాడు?"

"కేసు లేకుండా డబ్బు యిస్తా నంటాడు. ఏటో లే, బాబూ !" మాట మార్చి చెప్పాడు. పెదబాబు వెళ్ళి పోయేడు.

శ్రీపతి బైటకెళ్తూంటే చిన్నబాబు మెట్లదగ్గ రెదురయ్యాడు. శ్రీపతి కన్ను పడింది. అనుమానం – వీడేనేమో – ఆగాడు. చినబాబు లోపలి కెళ్ళాడు. కిటికీలోంచి చూచాడు, 'ఇంకేముంది? వీడే! సరే, వెళ్ళిపోయాడు శ్రీపతి.

ఆ మర్నాడు పెదబాబు సాయం కాలం కోర్టునుండి వస్తూ ఆస్పత్రి కొచ్చేసరికి చంద్రన్న మంచం ఖాళీ. "అతగాడు ఎవర్నో చంపి 20 ఏళ్ళ నుంచి పరారీలో వున్నాడంట బాబూ! ఒక గంటముందే పోలీసులొచ్చి తీసుకు పోయారు," అని చెప్పేడు ప్రక్కనున్న మంచంమీది రోగి.

పెదబాబు నిలువునా నీరైపోయాడు 'అరే, యిదేమిటి? పాపం మనిషి అలాటివాడు కాడే! ఇన్ని సంవత్సరాల నుంచి తనకి తరచు రిక్షా కడ్తున్నాడు. ఎంత ప్రేమా, మర్యాదా, వినయం చూపించేవాడు. ఏమో ! ఏ పుట్టలో ఏ పాముందో ! అనుకుంటూ ఇల్లు చేరాడు.

"వచ్చేవా బాబూ ! నీకోసం ఎవరో అమ్మాయి వచ్చి ఆఫీసు రూములో కూర్చుంది–ఉత్తరం ఏదో తెచ్చిందిట!" అంది పెదబాబుని పెంచుకుంటున్న తల్లి.

అలాగా "హలో, నమస్తే!"

"నమస్తే! ఇది మా క్లాస్‌మేట్ చంద్రం యిచ్చాడు. అంటే, చినబా బంటారు. వారి తండ్రి దెబ్బ లితగి హాస్పటలులో వున్నారులెండి."

"నేను ఇప్పుడు ఏమీ అర్థంకాని

పరిస్థితిలో, ప్రమాదంలో బందీనై వున్నాను రాధ నడిగి వివరాలు తెలుసు కొనండి నమస్తే

"చినబాబు."

పెదబాబు కిప్పుడు నిజంగా మతి పోయింది. "ఏమిటండీ! ఎవరు బంధించారు? ఏం జరిగింది."

"ఏం చెప్పమంటారు! సాయంత్రం 5 గంటలకు చినబాబు మా నాన్నగారి కార్లో వచ్చాడు. నేను విష్ చేశాను. నాన్నగారికి చెప్పేను – చంద్రం మా క్లాస్‌మేటని. నాన్నగారు అదోలా వున్నారు. చంద్రం, నాన్నగారు, మరోయిద్దరు క్రొత్త వ్యక్తులు లోపలి గదిలో కెళ్ళారు. చాలా గలాటా అయినట్లు చప్పుడయింది. నా కేమీ అర్థం కాలేదు. రాత్రి 8 గంటలకు బలవంతంగా చంద్రాన్ని కార్లో కూర్చోపెట్టి తీసుకుపోయారు. నేను మా సర్వెంట్సుద్వారా తెలుసుకుంటే, మా తోట్లో వున్న బంగళాలోని గదిలో బంధించినట్లు తెల్సింది. మీరు మా చంద్రాన్ని ఎలాగయినా కాపాడాలి ప్లీడరుగారూ!"

"రాధా! చంద్రం బ్రతికుండాలంటే నువ్విక్కడే నేను చెప్పేవరకూ ఉండాలి. జాగ్రత్తస్మా."

రాధ ప్లీడరుగారింట్లోనే వుండిపోయింది.

"ఏంవిటిది? చిత్రంగావుంది. కారు మబ్బు లల్లుకున్నట్టు ఇంత అగాధంగా వుండే యీ సంఘటన? దీని సంగతి పూర్తిగా తెల్సుకోవాలి."

చంద్రన్న యింటిముందు ఆగింది రిక్షా. పెదబాబుకి రాంవన్న స్వాగతం చెప్పాడు. "బాబూ, మా చంద్రన్న మాంవనీ, చినబాబునీ తమరే రక్షించాలి." బావురుమన్నాడు కాళ్ళమీద పడి రామన్న.


"ఫరవాలేదు. చినబాబు ఫొటో ఏదేనా వుంటే యియ్యి రామన్నా!"

పెట్టె తడుముతే ఎప్పటిదో పాత ఫొటో దొరికింది. చిన్నతనం నాటిది, బాబయ్యా!"

ప్లీడరు ఆ ఫొటో చూచేసరికి కళ్ళు తిరిగిపడేంత పనయింది. చిన్నప్పుడు తను సరిగ్గా యిలాగే వుండేవాడు. అది రాజారావు, భార్యప్రక్కనే పెదబాబు, ఆ ప్రక్క చంద్రన్న. చంద్రన్న చినబాబు నెత్తుకొని తీయించుకున్న గ్రూపుఫొటో.

"మళ్ళీవస్తా రామన్నా!" పెదబాబు సరాసరి యింటికొచ్చి గోడనున్న తన చిన్ననాటి ఫొటోతో పోల్చిచూశాడు. ఆశ్చర్యం–ముమ్మూర్తులా తేడాలేదు. "అమ్మా! అమ్మా, చూశావా అమ్మా యీ ఫొటో," అంటూ తల్లిని కేకేశాడు. ఆవిడగారు చూసి ఒక్కసారిగా కంగారుపడింది

"ఎవరిచ్చారుబాబూ నీ కిది? ఎలా వచ్చింది"



వున్నపళంగా దుఃఖంపొర్లి వచ్చింది. "అదేమిటమ్మా! ఏడుస్తా వెందుకు?''

"అదికాదు, బాబూ" 20 ఏళ్ళ క్రితం కధ చెప్పింది. రఘుకి యించుమించు పిచ్చెత్తినట్లయింది. తన కెన్నడూ తెలీని తన జన్మరహస్యం -యిదంతా ఎక్కడో కలలో చూచినట్లుంది.

చినబాబు తన తమ్ముడు, శ్రీపతి తన మామ, చంద్రన్న తనచిన్ననాటి నౌకరు, రాధ శ్రీపతిమామ కూతురు. శ్రీపతిఆర్యాపురం జమీందారు "అమ్మా. నే నొక్కసారి ఆర్యాపురం వెళ్లొస్తానమ్మా!" మరేం గాభరా లేదు. రేపు సాయంత్రానికి కొచ్చేస్తాను."

"త్వరగా రా, బాబూ, జాగ్రత్తస్మా!"

ఫొటోమీద వున్న ముద్ర ఆధారంగా ఆర్యాపురం ఫొటోస్టూడియో చేరాడు. అక్కడున్న ఫొటోలు పరికిస్తే, ఒక మూల యిదే గ్రూపుఫొటో ఉంది. "ఏవండీ, ఎవరి దీ ఫొటో?" ఫొటోస్టూడియో యజమాని కధంతా చెప్పాడు. కడకు బ్రతికి బయటపడ్డ చినబాబుని పొట్టను పెట్టుకున్నా డని

చంద్రన్ననుయిష్టం వచ్చినట్టు దూషించాడ

ఆ రోజు కోర్టులో చంద్రన్న కేసు విచారణ "20 ఏళ్ళక్రితం జమీందారుగారి చిన్నబ్బాయిని హత్య చేసి నగ ఎత్తుకుని పరారయినట్లు ఆరోపణ. నువ్వేమేనా చెప్పుకుంటావా?" "బోనులో నుంచునున్న చంద్రన్న నడిగాడు జడ్జి. "సరే, వారంరోజులు గడుపిస్తున్నాను. యీలోగా వాదించుకుంటే, అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకో.''

కోర్టునుండి రామన్న సరాసరి ప్లీడరుగారింటికి పరుగుపరుగున వచ్చాడు. పెదబాబు ఆర్యాపురంనుండి అప్పుడే వచ్చాడు. "ఏం రామన్నా !"

బాబూ! చంద్రన్న నిర్దోషి. ఎలాగయినా తమరే రక్షించాలి. వచ్చే శుక్రవారం వాయిదా!

సరేలే, రామన్నా చంద్రన్నకొచ్చిన భయమేం లేదు.''

పెదబాబు శ్రీపతిని క్రాసుపరీక్ష మొదలెట్టాడు. చంద్రన్న 20 సంవత్సరాల క్రితం చిన్నబాబును చంపి ఉన్నట్లయితే, యీనాడు చిన్నబాబుని అనుమానించి, తోటలోవున్న బంగళాలో ఒక యువకుణ్ణి బంధించేరే అది నిజమేనా."

శ్రీపతి నోరు పెగలలేదు కోర్టువారు పోలీసులను పంపి చినబాబును విడిపించి వెంటనే తెప్పించారు

"ఇతను చినబాబయినట్లయితే శ్రీపతి అతన్ని వెంటనే చంపేసి వుండాలికదా. ఎందుకంటే, ఎలాగూ అతను చిన్ననాడే చంపబడినట్లు రుజువయింది కదా," అన్నారు జడ్జిగారు లాయరుగార్ని ఉద్దేశించి.

"చిత్తం! చినబాబుని నిర్బంధించిన మరుక్షణం రాధ మా యింటికొచ్చి యీ వార్త చెప్పింది రాధ శ్రీపతి కూతురు, చినబాబు క్లాస్ మేట్; పైగా యిద్దరూ ప్రేమించుకున్నారు. ఆమె చెప్పిన వెంటనే, 'రాధను నిర్బంధంలో వుంచినట్లూ, తోటలో వున్న చినబాబును ఏంచేసినా రాధను చంపేస్తాననీ, ఎవరైనదీ తెలియకుండా ఫోను చేశాను."

''శ్రీపతే హంతకుడు. చంద్రన్న త్యాగి."

శ్రీపతికి యావజ్జీవకారాగావాసం విధించబడింది.

చంద్రన్న కళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయి "చంద్రన్నా! నీ రుణం జన్మజన్మాలకు తీర్చుకోలేం,'' అంటూ చినబాబూ, పెదబాబూ చంద్రన్నను కౌగలించుకున్నారు.